కథ

# నిర్ణయం

– వలివేటి నాగచంద్రావతి

వీధి తలుపు ఓరగా తీసి మొహం బయటపెట్టి అటూ ఇటూ తేరిపార జూసి, అనుమానాస్పదంగా ఎవరూలేరని నిర్ధారించుకున్నాక తలుపు మూసి గడియపెట్టింది సావిత్రమ్మ.

పడగ్గదిలోకి వెళ్లి ఆ తలుపు కూడా మూసి చెక్క బీరువా తెరిచింది. మెళ్లో గొలుసుకు వేలాడుతోన్న తాళంచెవితో బీరువా సొరుగు లాగింది. దాన్నిండా ఏవో కాగితాల కట్టలూ, చిన్న చిన్న వెండి సామానూ, పాత ఫొటోలు. వాటి మధ్యన ఓ పాతకాలం చాక్లెట్ల డబ్బా.

ఆ డబ్బాని అపురూపంగా బయటకు తీసింది సావిత్రమ్మ. మంచం మీద కూర్చుని డబ్బా మూతతీసి పరుపు మీద బోర్లించింది.

గలగల లాడుతూ నాణాలూ, పెళపెళ్లాడుతూ నోట్లూ పక్కమీదకి దొర్లాయి. చెయ్యొకసారి పమిట కొంగుకి బాగా తుడుచుకుని ఆ సొమ్ము లెక్కపెట్టడం మొదలుపెట్టింది సావిత్రమ్మ.

ముందు నాణాలు... తరువాత నోట్లు. మొత్తం నలభై రెండు వేల నాలుగువందలు. సావిత్రమ్మ కళ్లు సంతృప్తిగా విప్పారాయి. ఇంత డబ్బు ఒకేసారి చేతిలో పెడితే మెప్పుగా వెలిగిపోయే కోడలి మొహం ఊహించి చాలా సంతోషమనిపించింది సావిత్రమ్మకి.

'నా పిల్లలకి నేనుండగా తక్కువ కానిస్తానా' అనుకుంది ఒకింత గర్వంగా. అదే సావిత్రమ్మ లక్ష్యం, పంతం.

★ ★ ★

ఆ ఇంట్లో ఇద్దరు మగపిల్లల తర్వాత కాస్త ఎడంగా పుట్టిన ఆడపిల్ల సావిత్రి. మధ్య తరగతి కుటుంబమే అయినా ఆడపిల్లా అందునా చిట్టచివరి సంతానం అవటంవల్ల సావిత్రిని అల్లారుముద్దుగా చూసేవారు ఇంటిల్లిపాదీ. ఆ అమ్మాయి నోటివెంట మాట రావడం ఆలస్యం తీర్చేదాకా అగ్గగ్గలాడిపోయే వారందరూ.

ఆమెకు యుక్త వయసు వచ్చేవేళకు విధి వక్రించింది. కొన్ని నెలల తేడాతో తల్లీ తండ్రీ కాలం చేశారు. అప్పట్నుంచీ సావిత్రి అదృష్టం తిరగబడింది. ఇంటి పెత్తనం వదినల చేతికొచ్చింది. అసలే అత్తగారు ఇప్పటిదాకా అడబడుచుకి యువరాణి హోదా ఇస్తున్నందుకు గుర్రువాళ్లకి. ఇప్పుడా అత్తగారు లేకపోయె. ఇక చెప్పేదేముంది.

వాళ్లు చూపించే మత్సరం, అణచివేత సహించలేక అన్నగార్లతో చెప్పుకున్నా ఫలితం లేక పెంకి తనంగా తయారయింది. ప్రతిదానికీ పంతం, గొడవ. రోజూ ఇంట్లో యుద్ధమే.

'ఇంటిలోన పోరు ఇంతింతకాదయా...' అని, ఆ అల్లరీ ఆగం భరించలేక తొందరగా పెళ్లి చేసి పంపించెయ్యాలనే నిర్ణయానికొచ్చారు అన్నగార్లు. ఈ ఇంటినుంచి విడుదలవటమే మేలనుకుంది సావిత్రి కూడా.


అన్నగార్లు తెచ్చిన సంబంధాలలో పేరుకు తగ్గట్టు అందగాడైన సుందరమూర్తిని వరుడిగా ఎన్నుకుంది సావిత్రి. ముఖ్యంగా "నెత్తిమీద జుట్టు తప్ప ఏముందని అతనికి?" అని వదినలు పెదవి విరిచినందుగ్గానూ అతనే కావాలని పంతం పట్టి మరీ చేసుకుంది సావిత్రి. ఆ పంతానికి తనకే శిక్ష పడుతుందని తెలుసుకోలేకపోయింది ఆ అమాయకురాలు.

★ ★ ★

సుందరమూర్తి అందగాడేకాదు శాంతమూర్తి కూడా. ఒక్కనాడూ భార్యకు ఎదురు చెప్పేవాడు కాదు. పూలబాట మీద నడకలా హాయిగా సాగిపోతున్న జీవితంలోకి కొత్త ఆనందాలు మోసుకొచ్చాడు చంద్రమౌళి. అనుకూలుడయిన భర్త, చందమామ లాంటి బిడ్డ... "నా అంత అదృష్టవంతురాలు మరొకరుండరు" పొంగిపోయింది సావిత్రి.

ఆ పొంగు చూడలేని విధి మరోసారి వెక్కిరించింది. రోడ్డు ప్రమాదంలో సుందరమూర్తి మరణించాడు.

అంధకారంలో కూరుకుపోతున్న ఆమెను పాపమని సానుభూతి చూపించలేదు సరికదా, "కాస్త వెనక ఆస్తి ఉన్న వాణ్ణి చూస్తామంటే విన్నదా. ఇప్పుడు చూడండి. దరిద్రమంతా మా నెత్తినే ఎక్కబోతోంది. ఏలిన్నాటి శని గడప దాటిందనుకుంటే రెట్టింపయి తిరిగి వస్తోంది. ఖర్మ. ఎవరికి తప్పినా మాకు తప్పుతుందా" అంటూ మాటల శూలాలు విసిరి గాయాలు చేశారు వదినలు.



"ఆరేళ్లొచ్చినయ్ పిల్లగాడికి. ఇంకో అయిదారేళ్లు భరించితే ఏ చిల్లర కొట్లోనో, కారు గారేజీలోనో చేతికింద పనికి పంపించొచ్చును. ఓ వెయ్యి రూపాయలు తెచ్చుకుంటాడు" ముందాలోచన చేశారు అన్నగార్లు.

శోకానికి మించి పౌరుషం పొంగుకొచ్చింది సావిత్రికి. 'వాళ్ల కొడుకులు కాలేజీ చదువులు చదివే వాళ్లూనూ, నా బిడ్డ చేతికింద పనివాడూనా- నా కంఠంలో ప్రాణముండగా అలా కానివ్వను. వాళ్లకంటే గొప్పవాణ్ణి చేస్తాను, చేసి చూపిస్తాను' శపథం చేసుకుంది సావిత్రి గట్టిగా.

అన్నలు రమ్మన్నా పుట్టింటికి వెళ్లలేదు. వాళ్లనుంచి చిన్నమెత్తు సాయం పొందకూడదని పట్టుదల. మరి తన పంతం నెరవేరేదెలా? తల్లి గారాబం వల్ల చదువా అబ్బలేదు. అంచేత ఏ ఉద్యోగానికీ తను అర్హురాలు కాదు. ఏది దారి?

చాలా యోచన చేసింది సావిత్రి. టౌనులో ఉంటే ఖర్చు ఎక్కువ. పక్కనే ఉన్న చిన్న పల్లెటూరికి మారిపోయింది. తన నగలన్నీ అమ్మిన పైకానికి భర్త ఆఫీసు వాళ్లిచ్చిన డబ్బు జతచేసి నాలుగు గేదెల్నీ, ఓ కుట్టు మెషీన్నీ కొన్నది. ఎండకన్నెరగకుండా పెరిగిన సుకుమారి పశువుల దగ్గర పనికూడా చిరాకు పడకుండా చేసింది. పాలమ్మింది, పెరుగమ్మింది, బట్టలు కుట్టింది. నామర్దా అనుకోకుండా క్షణం కూర్చోకుండా, ఇంట్లో ఉండి తను చేయగలిగిన పనులన్నీ చేసింది. పైసా పైసా కూడబెట్టింది.

రూపాయి ఖర్చు పెట్టాలంటే పదిసార్లు ఆలోచించి లోభితనం చూపించే సావిత్రి కొడుకు దగ్గర కొచ్చేసరికి ఏలోటూ రానిచ్చేది కాదు. బట్టలు నలగనిచ్చేదికాదు. వెండి కంచంలో వెన్నామీగడా వేసే పెట్టేది. ఫీజులు ఎక్కువయినా డొనేషన్లు కట్టాల్సివచ్చినా వెనకాడకుండా మంచి స్కూల్‌లోనే చేర్పించింది.

మౌళి చాలా బుద్ధిమంతుడు. తల్లి ఆకాంక్షా, పడుతున్న శ్రమా అర్థం చేసుకున్నాడు. శ్రద్ధగా చదువుకున్నాడు. మేనమామ కొడుకులు డిగ్రీతో చదువు ఆపేస్తే మౌళి మాస్టర్స్ చేసి మంచి ఉద్యోగం కూడా సంపాదించుకుని తల్లిని సంతోషపెట్టాడు.

సావిత్రి పట్టిన అసిధారావ్రతం పూర్తయింది. వ్రత ఫలం ఇబ్బడిముబ్బడిగా చేతికందింది.

"ఏమో అనుకున్నాంగానీ 'సావిత్రి' అన్న పేరు నిలబెట్టుకున్నావ్ సుమా" అన్నారు వదినలు నొసలు పైకెగరేసి. ఉపవాసం తరవాత పిండి వంటలతో సహా వడ్డించిన

విస్తరి ముందు కూర్చున్నట్టు చాలా తృప్తి పడింది సావిత్రి.

మౌళికి వచ్చిన ఉద్యోగం హైదరాబాదులో. తల్లిని కూడా తనతోపాటు తీసుకువెళ్లాలని చాలా ప్రయత్నించాడు. "ఈ పాడీ పశువూ కామాటం ఉన్నపాటున వదిలిరావడం అయ్యేపనా నాన్నా. ముందు నువ్వు వెళ్లి వసతీ అదీ చూసుకో. నాదేముంది- ఇవ్వాళో రేపో నీ దగ్గరకి చేరాల్సిన దాన్నేకదా!" కొడుకుని సమాధాన పరిచి పంపించింది సావిత్రమ్మ.

మౌళి ఉద్యోగస్థుడైన దగ్గర్నుంచీ చిన్న అన్నగారు చెల్లెలింటికి రాకపోకలు సాగిస్తున్నాడు.

"మౌళిని ఓసారి మా ఇంటికి పంపవే సావిత్రీ. బావని చూడాలని మంజుల తెగ సరదా పడుతోంది" అంటున్నాడు.

'హు... ఒకప్పుడు ఈ అన్నావదినగార్లే "పేడవాసన అత్త ఇంట్లో. మేము రాము అంటారమ్మా పిల్లలు. ఏమీ అనుకోవద్దు సావిత్రీ" అన్నారు. ఇప్పుడు పిల్లనిస్తామని వస్తున్నారు' నిరసనగా అనుకుంది సావిత్రి. ఎందుకయినా మంచిదని మౌళి అభిప్రాయం కూడా అడిగింది. తన పెళ్లి విషయం పూర్తిగా తల్లికే వదిలేసి, "అంతా నీఇష్టమమ్మా" అన్నాడు మౌళి.

ఇక ఆలస్యం చేయలేదు సావిత్రి. ఎప్పట్నుంచో ఆమె దృష్టి సుప్రియ మీద ఉంది. తన చిన్ననాటి స్నేహితురాలు దమయంతి కూతురు సుప్రియ.

విధి తనని చూసి వెక్కిరించినప్పుడు కొందరిలా తగిన శాస్తి జరిగిందనుకోక తనని ఓదార్చడానికి వచ్చింది దమయంతి. కన్నీళ్లు పెట్టుకుంది. తను కోలుకుని ముందడుగు వెయ్యటానికి ధైర్యం చెప్పింది.

ఒకటి రెండుసార్లు తల్లి వెంట వచ్చిన సుప్రియ చాలా నచ్చింది సావిత్రికి. చాలా ఒద్దికయిన పిల్ల.

దమయంతి భర్త ప్లీడరు గుమస్తా. ఒకరి తరవాత ఒకరు ముగ్గురు ఆడపిల్లలు వాళ్లకి. సావిత్రమ్మ సంబంధం కలుపుకుంటానన్నప్పుడు దమయంతి భయపడింది. "మీకు తూగగలనా" అంది. "నా కొడుకు కాళ్లు కడిగి నీ కూతురిని కన్యాదానమివ్వు చాలు" అంది సావిత్రి.

పెళ్లయిపోయింది. కాపురానికి తీసుకొచ్చేటప్పుడుకూడా, "చీరా సారే అంటూ బరువు పెంచుకోకు. పసుపు చెంబు ఇచ్చి పంపించు. నీ కూతురికి ఏలోటూ రాకుండా నేను చూసుకుంటా" అంది భరోసాగా.

అన్నట్టుగానే కొడుకు సంసారానికి కావాల్సిన మంచం కంచం పప్పూ ఉప్పూతో సహా సమస్తం అమర్చి కోడల్ని కొడుకు దగ్గర దిగబెట్టింది.

మౌళి చాలా ప్రాధేయపడ్డాడు. ఇక తమతోపాటూ ఉండిపొమ్మని. పాతపాటే పాడింది సావిత్రమ్మ గొడ్డూ గోదా అంటూ. "అప్పుడే వచ్చేశారా" అని పరామర్శించిన ఊళ్లోవాళ్లకి "కొత్తగా పెళ్లయిన జంట, వాళ్ల మధ్యన పానకంలో పుడకలా నేనెందుకక్కడ" అంది గడుసుగా.


అసలు కారణం ఆవిడకు మాత్రమే తెలుసు.

సిటీలో కొడుకు తీసుకున్న అపార్ట్‌మెంట్‌లో మార్బుల్ వేసిన ఫ్లోరింగు, సన్‌గ్లాస్‌తో తళతళలాడుతున్న వార్డ్‌రోబ్సూ, మాడ్యులర్ కిచెనూ... అన్నీ చూసి ఉబ్బితబ్బిబ్బయిపోయింది సావిత్రి. కానీ సుప్రియకి మాత్రం తృప్తనిపించ లేదు. అంతక్రితమే ఆ కమ్యూనిటీలో ఉన్న స్నేహితుడి ఇంటికి భార్యను తీసుకువెళ్లాడు మౌళి పరిచయం చేద్దామని. వాళ్లఫ్లాటు వైభవం ఏమని చెప్పాలి- ఖరీదయిన ఫర్నీచరుతో కళకళ్లాడిపోతోంది.

తమ ఇంట్లో ఏమున్నాయ్- కేన్ కుర్చీలు నాలుగూ, నవారు మంచాలు రెండూను.

"హు... ఇల్లు బావుంటే సరా. దానికి తగ్గ ఫర్నీచరు లేకపోతే ఇలా అయ్యవారి నట్టిల్లల్లేనే ఉంటుంది" అంది పెదవి విరిచి.

భర్తని "ఒక్క టీవీ అయినా తీసుకుందాం" అని ప్రాధేయపడితే, "నా ఎడ్యుకేషన్‌లోన్ తీరే



దాకా నోరు మెదపద్దు" అన్నాడట ఖచ్చితంగా.

వేలబడిపోయిన కోడలి మొహం చూడగానే, "నీ కూతురికి ఏ లోటూ రానివ్వను" అని స్నేహితురాలికిచ్చిన మాట గుర్తుకొచ్చింది సావిత్రమ్మకి.

"బాధపడకే అమ్మాయ్, ఒక్కటొక్కటీ నేకొనిపెడతాగా" అంది.

అలా అభయమిచ్చాక ఇంకా అక్కడే ఉండి తిని కూర్చుంటే ఎలా? తిరిగిరావడమేమిటి- పనిలోకి దిగిపోయింది ఈసారి రెట్టింపు కార్యదీక్షతో. మౌళి ఉద్యోగస్థుడయ్యాక బలవంతానా గేదెల్ని అమ్మించేశాడు. మిగతా పని చేయడానికి కూడా పాలేరుని కుదిర్చాడు.

ఊరికి వచ్చీరాగానే సావిత్రమ్మ చేసిన మొదటి పని, తల్లి జ్ఞాపకార్థం అమ్మకుండా ఉంచుకున్న ఒకే ఒక్క గొలుసునీ తెగనమ్మి, చంటి పిల్లలున్న ఇళ్లలో ఆవుపాల గిరాకి ఎక్కువగా ఉన్నదని ఒక ఆవునీ, ఇంకో గేదెనీ కొనేసింది. పాలేర్ని కాస్తా మానిపించేసింది. కంటిచూపుకి కాస్త ఇబ్బందిగా ఉంటోందని మూలన పెట్టేసిన కుట్టు మిషను దుమ్ము దులిపి సమయం దొరికితే చాలు టకటకమనిపించేస్తోంది.

ఊర్లో ఇదివరకు సావిత్రమ్మ "జాగ్రత్త మనిషి" అని మాత్రమే అనుకునేవాళ్లు. ఇప్పుడయితే, "ఎంత పిసినారో, ఎంగిలి చేత్తో కాకిని తోలట్లా" అని చెవులు కొరుక్కుంటున్నారు.

అనుకోరామరి- వెన్న తీసిన మజ్జిగనీ, పెరట్లో కాసిన పువ్వునీ కాయనీ ఇదివరలో బీదా బిక్కీ అడిగినవాళ్లకి ఇచ్చేస్తుండేది. ఇప్పుడు ప్రతిదానికీ ఖరీదు కట్టే తీరుతోంది.

అలా ఆరునెలలు గీసీ గీసీ పోగేసిన కష్టం ఈ నలభై రెండువేలూ...

★ ★ ★

రాజ్యాలు జయించినంత విజయ గర్వంతో కొడుకు ఇంటి గుమ్మంలో అడుగుపెట్టి పొంగుతున్న పాలమీద నీళ్లు చల్లినట్టు చల్లారిపోయింది సావిత్రమ్మ.

ముందు హాల్లో సోఫాసెట్, గోడకి పెద్ద టీవీ సెట్, పూసల పరదా వెనక తళతళలాడుతోన్న గ్లాస్ టాప్ డైనింగ్ టేబుల్... ఇది తన కొడుకు ఇల్లేనా?

"రండి రండి అత్తయ్యా!" సుప్రియ ఆప్యాయంగా లోపలికాహ్వానించేదాకా అలాగే నిలబడిపోయింది సావిత్రమ్మ.

హాల్లోనే కాదు, అన్ని గదుల్లోనూ కొత్త వస్తువులు వచ్చి చేరాయి. మిక్సీ ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, పడగ్గదిలో ఊరంతమంచం, డన్‌లప్ పురుపు... ఇవన్నీ ఒక్కసారిగా... ఎలా...?

"ఏం చెయ్యమంటావమ్మా. ఇవన్నీ ఇంటికొచ్చేదాకా నీ కోడలు నన్ను నిద్రపోనివ్వలేదనుకో" మురిపెంగా భార్యకేసి చూస్తూ చెప్పాడు మౌళి.

'మరి లోను?' అడక్కుండానే ఆ ప్రశ్నకీ జవాబిచ్చేశాడు మౌళి.

"ఇక్కడ కొన్ని పెద్దపెద్ద షోరూముల్లో జీరో పర్సెంట్ ఇంట్రెస్ట్‌కి మనకు కావాల్సిన వస్తువులు ముందే ఇచ్చేస్తారు- నెలనెలా కొద్ది మొత్తంలో తీర్చుకునేలాగ. లోనుకూడా కట్టాల్సినదాన్లో సగమే కడుతున్నాను. ఫర్లేదు కాస్త ఆలస్యమవుతుందంతే. ఈలోగా ఇంక్రిమెంట్ వచ్చి శాలరీ పెరుగుతుంది. ప్రమోషన్ కూడా రావచ్చు. అప్పుడిక ఇబ్బందే ఉండదు" అని.

సంతోషించవలసిన సంగతే. కానీ ఏదో వెలితి సావిత్రమ్మకి. "నేనింకా టీవీ, సోఫాలూ కొనిపెడదామని వచ్చానురా అబ్బాయ్" అంది సావిత్రమ్మ. ఆశాభంగం తాలూకూ ఛాయలు వద్దనుకున్నా తొంగి చూశాయావిడ స్వరంలో.

తల్లి మాటలు వినిపించనట్టే, "అమ్మా నీ చేతులు చూడు- ఎంత గరుకుబారిపోయాయో" రాత్రి భోజనాలయ్యాక టీవీ ముందు పెద్దసోఫాలో కూర్చున్న తల్లి ఒడిలో తలపెట్టి పడుకుని ఆమె చేతులు రెండూ చెంపల కానించుకున్నాడు మౌళి.

నవ్వింది సావిత్రమ్మ.

"ఇంక చాలమ్మా. నీ శక్తంతా కరగబెట్టి నన్నింతవాణ్ణి చేశావు. నా కాళ్లమీద నిలబడగలిగినా ఇంకా నిన్ను పీల్చి పిప్పి చెయ్యమంటూ నన్ను చిన్నబుచ్చకమ్మా" మౌళి కంఠంలో దుఃఖపు జీర. కొడుకు తల నిమురుతూ మరి మాట్లాడలేదు సావిత్రమ్మ.

కానీ మనసునిండా నైరాశ్యం.

"ఓ మాటిలా వస్తారా అత్తయ్యా" వంటిల్లు సర్దుతోన్న సుప్రియ పిలుపు.

ఆలోచనల నుంచి తేరుకుని కొడుకు తల దిండుమీదకి చేర్చి లేచింది సావిత్రమ్మ.

"ఈ ప్లేట్లు తుడిచి పెట్టరూ" గాజు ప్లేట్లు అత్తగారికందించి, "ఆయన మాటలకి మీరు బాధపడకండత్తయ్యా. మీ అబ్బాయిదంతా , విడ్డూరంగానీ పిల్లలకి పెట్టుకోవాలని ఏ తల్లిదండ్రులకుండదూ! దానికో పరిధీ కాలపరిమితీ ఉంటాయా ఏం? అయినా ఆయన తీసుకోకపోతే ఏమిటి, నేను తీసుకుంటా సరేనా" అంది బుజ్జగింపుగా.

అప్పుడు గుర్తొచ్చాయి మధ్యాహ్నం కోడలిముఖతా విన్న మాటలు-

ఆ కమ్యూనిటీలోనే ఉన్న లేడీస్ క్లబ్ యానివర్సరీ అట. ఆ ఫంక్షన్ కోసం ఎదురు ఫ్లాటు సి.టి.ఒ గారి భార్యా పక్క ఫ్లాటు ప్రొఫెసరుగారి భార్యా పాతికవేలు పెట్టి బ్రహ్మాండమైన డిజైనర్ శారీస్ కొనుక్కున్నారట. "మీ అబ్బాయినడిగితే, 'ఇదేం పెళ్లా పండగా- ఎంచక్కా ఆ వెంకటగిరి జరీ చీర కట్టుకువెళ్లు. అందరికన్నా హుందాగా ఉంటావు' అన్నారు. వాళ్ల డిజైనర్ శారీల ముందు నా నేతచీర ఎంత నామర్దాగా ఉంటుందో చెప్పండి" అంది.

కోడలి గడుసుతనానికి విస్తుపోయింది సావిత్రమ్మ. 'అంటే తను చెమటోడ్చి తెచ్చిన నలభై వేలూ కోడలి చీరలకు ఖర్చవబోతోందా?' ఎందుకో ఇష్టంగా అనిపించలేదు.

తానూ పోటీ పడింది... ఎందుకు? కొడుకుని పైకి తీసుకురావాలనీ, నలుగురితోనూ శభాష్ అనిపించుకోవాలని. ఇలా పొరుగువారితో సమానంగా చీరలూ నగలూ కావాలనికాదు. ఉహూఁ సుప్రియది ఆరోగ్యకరమైన పోటీ కాదు.

★ ★ ★

తల్లిని జాగ్రత్తగా ఏసీ బోగీ ఎక్కించి రైలు బయలుదేరడానికి ఇంకా టైముందని తల్లి పక్కన వచ్చి కూర్చున్నాడు మౌళి. వీడ్కోలు ఎప్పుడూ బాధాకరమే.

"అమ్మా నువ్వింకా కష్టపడటం నాకిష్టం లేదు. ఆ లంపటాలన్నీ వదిలించుకుని తొందరగా నా దగ్గరకొచ్చెయ్యవూ" కొడుకు గొంతులో ఆర్తికి కదిలిపోయి ప్రేమగా చూస్తూ తలూపింది సావిత్రమ్మ.

రైలు కదిలింది. సావిత్రమ్మ తల్లో ఆలోచనల చెదలపుట్ట కూడా కదిలింది.

'తనిప్పుడు వెనక్కి వెళ్లి చేసేదేముంది? మళ్లీ డబ్బు కూడబెట్టడానికా- ఎందుకు? తన కొడుక్కి అవసరంలేదు. కోడలి ఆడంబరాలకి తనివ్వలేదు. అందుకే తీసుకెళ్లిన దాంట్లో ఇరవైవేలు మాత్రమే తప్పనిసరై కోడలి చేతిలో పెట్టి వస్తోంది.

పోనీ కొడుకు ప్రాధేయపడినట్లు వాళ్ల దగ్గరకి చేరిపోయి 'కృష్ణా రామా' అనుకుంటూ కాలం వెళ్లబుచ్చడమా- ఉహూఁ తనకింకా పనిచేయగల వయసుంది. సత్తువా ఉంది. ఇరవై సంవత్సరాలకు పైగా పనికి అలవాటయిన శరీరమూ మనసూ అందుకు ఎదురు తిరుగుతున్నాయ్.

మరేం చెయ్యడం?

★ ★ ★

స్టేషన్లో బండి ఆగింది... గంట ఆలస్యంగా. అప్పటికే మునిమాపు వేళయింది. సిటీబస్ కోసం ఎదురుచూడకుండా షేర్ ఆటోలో పక్క ఊర్లో ఉన్న ఇంటికి చేరుకునే సరికి దీపాలు పెట్టేశారు.


గేటు తెరిచి లోపలి కడుగు పెడుతూ ఆగిపోయింది సావిత్రమ్మ. ఇంటి వరండాలో అయిదారుగురు చాపలు పరుచుకు పడుకోబోతున్నారు.

"ఎవరది? " గద్దించింది.

"నేనమ్మా తవిటమ్మని" వరండా మెట్లుదిగి వీధి లైటు వెలుతురులోకి వచ్చింది తవిటమ్మ.

"నువ్వా? " అంది సావిత్రమ్మ గాభరాతీరి.

"నువ్వు ఎటూ లేవుకదా అని వరండాలో పిల్లలూ మేమూ పడుకుంటున్నామమ్మా"



తవిటమ్మ సంజాయిషీ ఇస్తోంది దబదబా పక్కలన్నీ పోగుపెట్టేస్తూ.

"పర్లేదు పర్లేదు... లేవకండి పడుకోండి" అంది సావిత్రమ్మ తాళంతీసి లోపలికి వెళుతూ.

మొన్న మొన్నటిదాకా పాలేరుకి సాయంగా పశువుల దగ్గరా, ఇంట్లో పనీ చేసి పెడుతుండేది తవిటమ్మ. తను ఊరు వేళ్లేముందే తెలిసింది. కాలువ గట్టున వేసుకున్న నాలుగు పూరి గుడిసెలూ అగ్ని హోత్రుడికి నైవేద్య మయ్యాయని. వాటిల్లో ఒకటి తవిటమ్మది.

సరిగ్గా కొడుకు దగ్గరకెళ్లే ముందురోజు పిల్లల్ని వెంటేసుకు వచ్చింది తవిటమ్మ.

"అమ్మా మొండి గోడలు మిగిల్చిందా అగ్గి. ఎలాగో ఆ గోడల చాటునే ఉడకేసుకుంటున్నాం. రాత్రిళ్లే- ఆరుబయట చలికి బిడ్డలు బిగదీసుకు పోతున్నారమ్మా. ఓ వెయ్యి అప్పిచ్చినావంటే నాలుగు వాసాలు పాతి, పైన తాటాకులు కప్పుకుంటామమ్మా. నీ పేరు చెప్పుకుని బిడ్డల్ని బతికించుకుంటా నమ్మా" అని కాళ్లా వేళ్లా పడింది.

నిజంగా జాలేసింది. కానీ కొడుక్కోసం దాచిన రొక్కంలో మొరిక ఎలా పెడుతుంది. అయినా తనకు మాలిన ధర్మం కూడదన్నారు పెద్దలు.

"నా దగ్గరెక్కడుందే తవిటమ్మా. డబ్బుకి ఇబ్బందిగా ఉంటోందనేకదా నిన్నుకూడా పని మానిపించాను" అంది కారుణ్యాన్ని వెనకపెట్టి.

ఆ రాత్రి నిద్రాదేవత సావిత్రమ్మని కనికరించలేదు. రైలు ఆగినప్పుడు నిలిచిపోయిన ఆలోచనలు జోరీగల్లా మనసును చుట్టిముట్టి గీపెట్టాయి. 'ఈసారి సంపాదించినది తనే గాజులో గొలుసులో చేయించేసుకుంటేనో- అయ్యోరాత. నగలమీద వ్యామోహం పాతికేళ్ల క్రితమే చచ్చిపోయింది. ఇప్పుడు లేచి రమ్మంటే వస్తుందా ఉహూఁ...' అదా, ఇదా ఏదీ అన్న గుంజాటన మూలంగా తెల్లవారుజాముదాకా మెసుల్తూనే ఉంది సావిత్రమ్మ.

★ ★ ★

"అమ్మా అమ్మగారూ" తవిటమ్మ కేకలతో మెలకువ వచ్చింది సావిత్రమ్మకి. గోడకున్న వెంకన్న క్యాలెండరుకి దణ్ణం పెట్టుకుంటూ లేచి వీధి తలుపు తెరిచింది.

"వరండా కడిగి ముగ్గేశానమ్మా. వెళ్లేటప్పుడు చెప్పిపోదామని పిలిచాను" అంటోంది తవిటమ్మ.

రాత్రి తనని చూడగానే- కప్పుకున్న చింకి దుప్పట్లు పక్కకు తోసేసి, భయంగా లేచిపోయి తల్లి చీరకుచ్చిళ్లు చుట్టుకుంటూ ముడుచుకుపోతున్న దాని పిల్లలు చటుక్కున గుర్తుకొచ్చారెందుకో సావిత్రమ్మకి.

అప్రయత్నంగానే, "తవిటమ్మా" అని పిలిచింది. గేటువరకూ వెళ్లిన తవిటమ్మ వెనక్కి తిరిగింది. "వెయ్యి రూపాయలు కావాలన్నావు గదూ, రా ఇస్తాను" అంది సావిత్రమ్మ.

"నా తల్లి... నాతల్లి... నా బిడ్డల్ని బతికించి నావమ్మా" అంటూ ఇంతమొహం చేసుకుని గుమ్మంముందు దాకా వచ్చింది దండాలు పెడుతూ.

లోపలికొచ్చి పర్సులో నోట్లు లెక్కపెడుతున్న సావిత్రమ్మకి ఇరవై వేలు చేతిలోపెట్టినా వెలగని సుప్రియ మొహం మనసులో మెదిలి నోట్లు లెక్కపెట్టడం మానేసింది మొత్తం ఇరవైవేలూ చేతిలోకి తీసుకుని బయటకు వచ్చింది.

"తవిటమ్మా, ఇంటికి పూర్తిగా కప్పు వేయించుకో. రెండు బళ్లు మట్టికూడా తోలించుకుని గోడలు మెత్తుకో" అంది డబ్బంతా తవిటమ్మ చేతిలో పెడుతూ. "ఇది అప్పుకాదు- నీ పిల్లల కోసం నేను చేస్తున్న సాయమనుకో."

భగవంతుడి ముందు మోకరిల్లినట్టు మోకరిల్లి రెండు చేతులతోనూ సావిత్రమ్మ పాదాలు తాకింది తవిటమ్మ చెమర్చిన కళ్లతో.

కొడుకుకోసం కష్టపడుతున్నప్పుడు ఒక బాధ్యత, బరువు, తపన తనని తరుముతున్నట్టుండేది. అది స్వార్థం. 'నా, నాది, నాకు' అనే మాటలు మరిచిపోయి ఆపదలో చెయ్యిజాపిన వారిని ఆదుకోవడంలో ఎంత తృప్తి, ఎంత ఆనందం! హృదయమెంతో విశాలమైనట్టూ అదంతా అమృతంతో నిండినట్టూ హాయైన అనుభూతి.

"అమ్మయ్య, ఇక నేనెందుకు సంపాదించాలీ అని కొశ్చన్ మార్క్ వేసుకోనక్కరలేదు" ఏదో పెద్ద సమస్యకు అద్భుతమైన జవాబు దొరికినట్టు తేలిగ్గా నిట్టూర్చింది సావిత్రమ్మ. ★